సాక్షి
మహబూబ్‌నగర్
బుధవారం । 2 । ఏప్రిల్ । 2025



సమస్యలతో సతమతం

బాదేపల్లి మార్కెట్‌యార్డు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది.

వివరాలు 8లో ▸



నిర్విరామంగా..

ఎస్ఎల్‌బీసీ సొరంగంలో సహాయక చర్యలు నిర్విరామంగా కొనసాగుతున్నాయి.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
39.3 /18.6

వాతావరణం

ఉదయం నుంచే ఎండ ఎక్కువగా ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది. ఆకాశం స్వల్పంగా మేఘావృతమై ఉంటుంది.

అయితే.. రికార్డే..!

ధాన్యం సేకరణ లక్ష్యం 11.36 లక్షల మెట్రిక్ టన్నులు

- గత సీజన్లతో పోలిస్తే ఈ యాసంగిలో భారీగా వరిసాగు
- ఉమ్మడి జిల్లాలో 30 వరకు పెరిగిన కొనుగోలు కేంద్రాలు
- ఈ నెల రెండో వారంలో అందుబాటులోకి సెంటర్లు
- ఇప్పటికే అధికారులు, మిల్లర్లతో సమీక్షించిన ఆయా జిల్లాల కలెక్టర్లు
- కేంద్రాల వద్ద టెంట్లు, నీటి వసతి ఏర్పాటుకు ఆదేశాలు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్



రాష్ట్ర ప్రభుత్వం గత వానాకాలం నుంచి సన్నాలకు మద్దతు ధరతోపాటు ప్రోత్సాహకంగా క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ ఇస్తున్న విషయం తెలిసిందే. ఫలితంగా ఉమ్మడి పాలమూరులోని ఐదు జిల్లాల్లో అన్నదాతలు ఈ యాసంగిలోనూ వరిసాగు వైపే మొగ్గు చూపారు. ప్రధానంగా బీపీటీ, ఆర్ఎన్ఆర్ రకాలకు చెందిన సన్న రకాల ధాన్యం సాగుకు ప్రాధాన్యమిచ్చారు. ఈ క్రమంలో ఈ సీజన్‌లో సాధారణ సాగును మించి సుమారు 20 శాతం.. గత యాసంగితో పోలిస్తే దాదాపు 25 శాతం మేర వరి సాగు పెరిగినట్లు వ్యవసాయ శాఖ లెక్కగట్టింది. గతంలో ఎన్నడూ లేనంతగా ఈ సీజన్‌లో ఉమ్మడి జిల్లా పరిధిలో రికార్డు స్థాయిలో దాదాపు 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేసిన అధికారులు.. 11,36,660 మెట్రిక్ టన్నులు సేకరించాలనే లక్ష్యం నిర్దేశించారు.

1,61,504 ఎకరాల్లో పెరిగిన సాగు..

ఉమ్మడి జిల్లాలో గత యాసంగిలో 4,75,264 ఎకరాల్లో వరి సాగు కాగా.. ప్రస్తుతం ఇదే సీజన్‌లో 6,36,768 ఎకరాల్లో సాగు చేశారు. ఈ లెక్కన 1,61,504 ఎకరాల్లో వరి సాగు పెరగగా.. ఈ మేరకు అదనంగా మరో 30 కొనుగోలు కేంద్రాలను అదనంగా కేటాయించారు.

రెండో వారంలో కేంద్రాలు..

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో యాసంగి కోతలు ప్రారంభం కాగా.. ఎలాంటి ఆటంకాలు లేకుండా సేకరణ చేపట్టాలని అధికార యంత్రాంగానికి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల మొదటి వారం నుంచే ప్రభుత్వ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు అందుబాటులోకి తేవాలని సూచించింది. ఈ మేరకు జిల్లాల వారీగా కొనుగోలు సెంటర్లను అధికారులు ఖరారు చేశారు. అయితే ఉమ్మడి జిల్లా పరిధిలో కోతలకు మరింత సమయం పట్టనుండగా.. ఈ నెల రెండో వారం నుంచి కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తెచ్చేలా అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే నాగర్‌కర్నూల్ మినహా మిగతా జిల్లాల కలెక్టర్లు.. మిల్లర్లు, వ్యవసాయ, పౌరసరఫరాలు, రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సమీక్షలు నిర్వహించి తగిన సూచనలు చేశారు. ఎండాకాలం నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల వద్ద టెంట్లు, నీటి వసతి వంటి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

జిల్లాల వారీగా ఇలా..

మహబూబ్‌నగర్ జిల్లాలో గతేడాది యాసంగి సీజన్‌లో 1,11,724 ఎకరాల్లో వరి సాగు కాగా.. 2.16 లక్షల మె.ట., దిగుబడి వస్తుందని అంచనా వేశారు. 1.32 లక్షల మె.ట., సేకరణే లక్ష్యంగా 190 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుత యాసంగిలో 1,25,000 ఎకరాల్లో వరి సాగు కాగా.. 3,01,748 మె.ట., దిగుబడి వస్తుందని అంచనాకు వచ్చారు. ఇందులో 2,86,660 మె.ట., ధాన్యం సేకరణకు 188 సెంటర్లు కేటాయించారు. ఐకేపీ ఆధ్వర్యంలో 102, పీఏసీఎస్ 82, డీసీఎంఎస్ నాలుగు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం జిల్లాలో 188 క్యాలీపర్లు, 302 తూకం కొలిచే యంత్రాలు, 216 తేమ శాతం నమోదు యంత్రాలు, 195 ప్యాడీ క్లీనర్లు అందుబాటులో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

■ నాగర్‌కర్నూల్ జిల్లాలో గత యాసంగిలో 1,16,577 ఎకరాలు వరి సాగు కాగా.. ప్రస్తుతం ఇదే సీజన్‌లో 1,53,124 ఎకరాల్లో సాగైంది. ఈ లెక్కన 36,547 ఎకరాల్లో వరి సాగు పెరిగింది. ప్రస్తుతం జిల్లాలో ఎస్ఎల్‌బీసీ దుర్ఘటన నేపథ్యంలో అధికార యంత్రాంగం అక్కడే ఉండి సహాయక చర్యలను పర్యవేక్షిస్తోంది. ఈ జిల్లాలో ధాన్యం కోతలకు మరింత సమయం పట్టనుండగా.. మరో వారంలో కొనుగోళ్లకు సంబంధించి కసరత్తు చేపట్టనున్నారు.

■ నారాయణపేట జిల్లాలో గత యాసంగిలో 1,10,584 ఎకరాల్లో వరి సాగు కాగా.. ప్రస్తుత సీజన్‌లో 1,41,950 ఎకరాల్లో రైతులు సాగు చేశారు. ఈ లెక్కన 31,366 ఎకరాల్లో వరి సాగు పెరిగినట్లు తెలుస్తోంది. అప్పుడు 96 ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా.. ఈసారి అదనంగా మరో 6 సెంటర్లు కేటాయించారు. జిల్లాలో ధాన్యంలో తేమ శాతాన్ని కొలిచే యంత్రాలు 102, ప్యాడీ క్లీనర్లు 55 ఉన్నాయి.

■ జోగుళాంబ గద్వాల జిల్లాలో గత యాసంగిలో 44,379 ఎకరాల్లో వరి సాగు కాగా.. ఈసారి 69,694 ఎకరాల్లో సాగైనట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు 25,315 ఎకరాల్లో సాగు పెరిగినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం 75 ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరించాలని నిర్ణయించారు. జిల్లాలో ధాన్యంలో తేమ శాతాన్ని కొలిచే మిషన్లు 130, ప్యాడీ క్లీనర్లు 47 ఉన్నాయి.

■ వనపర్తి జిల్లాలో గత యాసంగిలో 92 వేల ఎకరాల్లో వరి సాగు కాగా.. ప్రస్తుతం ఇదే సీజన్‌లో 1,47,000 ఎకరాల్లో వరి సాగైంది. 55 వేల ఎకరాల్లో వరి సాగు పెరిగింది. గతంలో 390 ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా.. ఈసారి 414 సెంటర్లు చేయనున్నారు. ఇందులో 255 కేంద్రాల ద్వారా సన్నాలను కొనుగోలు చేయనుండగా.. దొడ్డు రకాల ధాన్యం కొనుగోళ్లకు 159 కేంద్రాలు కేటాయించారు. అలాగే ధాన్యంలో తేమ శాతాన్ని కొలిచే మిషన్లు 398, ప్యాడీ క్లీనర్లు 135 అందుబాటులో ఉన్నాయి.

యాసంగిలో వరి సాగు, సేకరణ లక్ష్యం ఇలా..

జిల్లా	వరి సాగు (ఎకరాల్లో)	ధాన్యం సేకరణ లక్ష్యం (మెట్రిక్ టన్నుల్లో)	కొనుగోలు కేంద్రాలు
మహబూబ్‌నగర్	1,25,000	2,86,660	188
నారాయణపేట	1,41,950	1,50,000	102
జోగుళాంబ గద్వాల	69,694	1,00,000	75
నాగర్‌కర్నూల్	1,53,124	3,00,000	202
వనపర్తి	1,47,000	3,00,000	414

గన్నీ బ్యాగులు, టార్పాలిన్ కవర్ల వివరాలు..

జిల్లా	అందుబాటులో ఉన్న గన్నీ బ్యాగులు	ఇంకా అవసరం ఉన్నవి	అందుబాటులో ఉన్న టార్పాలిన్లు
మహబూబ్‌నగర్	18,00,000	19,00,000	3,608
నారాయణపేట	9,07,121	28,42,879	3,000
జోగుళాంబ గద్వాల	2,00,000	40,00,000	3,500
నాగర్‌కర్నూల్	26,00,000	21,00,000	2,600
వనపర్తి	1,55,000	6,95,000	1,500

దళారులను ఆశ్రయించొద్దు



జిల్లాలో ఈ నెల మొదటి లేదా రెండో వారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేలా చర్యలు చేపడుతున్నాం. కేంద్రాల్లో అన్నిరకాల మౌలిక వసతులు కల్పిస్తున్నాం. రైతులు దళారులను నమ్మి తక్కువ ధరకు ధాన్యాన్ని విక్రయించి నష్టపోవద్దు.

– రవినాయక్, మేనేజర్, జిల్లా పౌర సరఫరాల సంస్థ

జంటలే లక్ష్యంగా దోపిడీలు



ఊర్కొండపేటలో సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఐజీ సత్యనారాయణ, ఎస్పీ గైక్వాడ్

- ఊర్కొండపేట ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో బ్లాక్‌మెయిల్ ముఠా
- వీడియోలు, ఫొటోలతో బెదిరించి డబ్బుల వసూళ్లు
- తాజాగా మహిళపై అత్యాచారానికి ఒడిగట్టింది ఈ ముఠానే..
- ప్రముఖ ఆలయం వద్ద కరువైన పోలీసుల నిఘా

సాక్షి, నాగర్‌కర్నూల్: ఉమ్మడి జిల్లాలో పేరుగాంచిన ఊర్కొండపేట ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో మహిళపై సామూహిక అత్యాచార కేసులో మరిన్ని విస్తుపోయే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ ఆలయ సమీపంలో కొన్నాళ్లుగా అసాంఘిక కార్యకలాపాలు సాగుతున్నట్టు తెలిసింది. తాజాగా మహిళపై అత్యాచారానికి ఒడిగట్టిన ఏడుగురు నిందితులే ముఠాగా ఏర్పడి కొన్నాళ్లుగా ఇదే తరహాలో అఘాయిత్యాలకు పాల్పడుతున్నట్టు పోలీసులు గుర్తించారు. ప్రస్తుత కేసులో ఉన్న ఏడుగురిలో ఐదుగురు ఇప్పటికే పలుమార్లు నేరాలకు పాల్పడినట్టుగా తేల్చారు. ఆలయానికి వచ్చే ప్రేమ జంటలే లక్ష్యంగా చేసుకుని బెదిరించి, దోపిడీలకు పాల్పడుతున్నట్టు గుర్తించారు. గతంలో ఎన్నిసార్లు ఇలాంటి నేరాలకు పాల్పడ్డారు.. ఇంకా బాధితులు ఎంత మంది ఉన్నారన్న కోణంలో పూర్తిస్థాయిలో విచారణ చేపడుతున్నారు.

చట్టం తెలిసిన నేరస్తులు.. మైనర్ల జోలికి వెళ్లరు

మహిళపై అత్యాచారం కేసులో పోలీసులు ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఆలయ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి మహేశ్‌గౌడ్‌తోపాటు ఊర్కొండపేట గ్రామానికి చెందిన బంగారు ఆంజనేయులు, మట్ట ఆంజనేయులు, సాదిక్ బాబా, హరీశ్, వాగుల్దాస్, మణికంఠ ఉన్నారు. వీరంతా ముఠాగా ఏర్పడి కొన్ని రోజులుగా మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడుతూ దోపిడీలు చేస్తున్నారు. అయితే వీరు మైనర్లు ఎవరైనా జంటలుగా కనిపిస్తే అప్రమత్తంగా ఉంటారు. వారిపై లైంగిక దాడులకు పాల్పడితే పోక్సో ద్వారా కఠిన శిక్షలు అమలు అవుతుండటంతో వారిని బెదిరించి, డబ్బులు మాత్రమే వసూలు చేస్తారు. వివాహిత మహిళలు, మేజర్లు అయితే దోపిడీ చేసి అత్యాచారానికి పాల్పడుతున్నారు. బంగారు ఆభరణాలను తీసుకున్నా బాధితులు ఫిర్యాదు చేసే అవకాశం ఎక్కువగా ఉండటంతో చాలా వరకు డబ్బులకే ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిసింది. ఈ ముఠా ఇప్పటి వరకు ఎంత మందిపై నేరాలకు పాల్పడ్డారన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు.

కనీస వసతులకూ దిక్కులేదు..

ఊర్కొండపేట ఆంజనేయస్వామి ఆలయానికి ఉమ్మడి జిల్లాతోపాటు నల్లగొండ, హైదరాబాద్ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఆలయంలో ప్రతి శనివారం నిర్వహించే భజన కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం అక్కడే రాత్రి బస చేస్తారు. అయితే ఈ ఆలయ ప్రాంగణంలో మహిళలకు కనీస వసతులు కూడా కరువయ్యాయి. అరకొరగా ఉన్న బాత్‌రూంలు, టాయిలెట్లను సైతం మూసి వేస్తుండటం, నిర్వహణ లేకపోవడంతో మహిళలు ఆరుబయటకు వెళ్లాల్సి వస్తోంది. తాగునీరు, టాయిలెట్లు, వసతి గదులు లేక మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సౌకర్యాలు లేక ఆరుబయటకు వెళ్తున్న మహిళలను బెదిరిస్తూ కొందరు అఘాయిత్యాలు, దోపిడీలకు పాల్పడుతున్నారు.

నిఘా వైఫల్యమేనా..?

ఊర్కొండపేట ఆలయ సమీపంలో గత కొన్ని నెలలుగా అసాంఘిక కార్యకలాపాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. ప్రత్యేకంగా ఆలయంలోని సిబ్బంది, గ్రామానికి చెందిన కొందరు ఆటోడ్రైవర్లు, యువకులు ఆలయానికి వచ్చే ప్రేమజంటలను లక్ష్యంగా చేసుకుని బెదిరింపులకు పాల్పడుతున్నారు. వారు ఒంటరిగా ఉన్న సమయంలో ఫొటోలు, వీడియోలు తీసి బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడుతూ, వారి వద్ద ఉన్న నగదును దోచుకుంటున్నారు. ఎవరికైనా చెప్పినా.. పోలీసులకు ఫిర్యాదు చేసినా.. ఫొటోలు, వీడియోలు బయట పెడుతామంటూ బెదిరిస్తున్నారు. గత కొన్నాళ్లుగా ఈ తరహా నేరాలు చోటుచేసుకుంటున్నా పోలీసులు అటువైపు కన్నెత్తి చూడలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పెట్రోలింగ్ పెంచుతాం: ఐజీ

కల్వకుర్తి టౌన్: ఉమ్మడి జిల్లాతోపాటు ఇతర జిల్లాల నుంచి చాలా మంది భక్తులు ఊర్కొండపేట ఆలయానికి వస్తారని, వీరి రక్షణ కోసం పోలీస్ పెట్రోలింగ్ పెంచుతామని మల్టీజోన్‌-2 ఐజీ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం అత్యాచార ఘటన జరిగిన ప్రదేశాన్ని జిల్లా ఎస్పీ గైక్వాడ్ రఘునాథ్ వైభవ్‌తో కలిసి పరిశీలించారు. ఊర్కొండ పోలీస్‌స్టేషన్‌కు సిబ్బందిగా ఎక్కువగా కేటాయించి, ఆలయం వద్ద పికెటింగ్ నిత్యం ఏర్పాటు చేసేలా చూస్తామన్నారు. స్థానికులు, ఆలయ పాలక మండలి, ఆలయ పరిసర ప్రాంత ప్రజలతో ఐజీ మాట్లాడి పలు వివరాలు తెలుసుకున్నారు. అత్యాచార ఘటనలో పాల్గొన్న ఆలయ ఉద్యోగి గురించి తెలుసుకొని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రజలు సహకారం అవసరమని ఐజీ పేర్కొన్నారు. ఐజీ వెంట కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ నాగార్జున, ఎస్ఐలు మాధవరెడ్డి, కృష్ణదేవ, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

బాధితురాలికి ప్రభుత్వం అండ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

ఊర్కొండ: ఊర్కొండపేట ఆంజనేయ స్వామి ఆలయం సమీపంలో అత్యాచార ఘటన జరగడం దారుణమని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే సంఘటనా స్థలాన్ని పరిశీలించి స్థానిక ఆలయ అధికారులు, పోలీసులతో వివరాలు తెలుసుకున్నారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎంతో ప్రాధాన్యత కలిగిన ఆలయ సమీపంలో జరిగిన ఈ సంఘటనను సీఎం రేవంత్‌రెడ్డి తీవ్రంగా పరిగణిస్తున్నారని, ఈ విషయమై తనతో ఫోన్‌లో మాట్లాడారని వివరించారు. ఈ ఘటనపై పోలీసులు వేగంగా స్పందించి విచారణ వేగవంతం చేస్తున్నారని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు. స్థానికంగా గంజాయి విక్రయాలు జరుగుతుంటే పోలీసులకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మత్తు పదార్థాల వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆరోపించారు. స్థానికులు దీనిపై వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ముఖ్యంగా ఆలయ పరిసరాల్లో లైటింగ్‌ను మెరుగుపర్చడంతోపాటు ఆలయ ప్రాంతానికి చుట్టూ కంచె ఏర్పాటు చేసేలా చూస్తామన్నారు. అలాగే ప్రతిరోజు పోలీస్ పికెట్ నిర్వహించేలా ఎస్పీతో మాట్లాడానని చెప్పారు.

న్యూస్‌రీల్

ఐపీఎల్ బెట్టింగ్ నిర్వాహకులపై నిఘా

మహబూబ్‌నగర్ క్రైం: క్రికెట్ బెట్టింగ్, ఆన్‌లైన్ గేమింగ్‌కు యువత దూరంగా ఉండాలని, ప్రాణాలతో చెలగాటం ఆడరాదని ఎస్పీ జానకి ఒక ప్రకటనలో తెలిపారు. యువత, విద్యార్థులు అక్రమ ఐపీఎల్ బెట్టింగ్, ఇతర యాప్స్, నిషేధిత గేమింగ్ ప్లాట్ ఫారమ్స్ పూర్తిగా దూరంగా ఉండాలన్నారు. తక్కువ సమయంలో పెద్దమొత్తంలో సంపాదించాలనే ఆకాంక్షతో యువత ఈ మార్గం ఎంచుకుని చివరకు వీటికి బానిసలుగా మారి ఆర్థికంగా నష్టపోవడంతోపాటు ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ఆన్‌లైన్ బెట్టింగ్, ప్లేకార్డ్స్‌పై తెలంగాణ పోలీస్ శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసిందని, ఆధునిక సాంకేతిక సాయంతో ఇలాంటి అక్రమాలు గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. ఐపీఎల్ బెట్టింగ్ వల్ల భారీ స్థాయిలో యువత అప్పుల్లో కూరుకుపోయి మానసికంగా ఒత్తిడికి గురై తప్పుడు నిర్ణయాలు తీసుకునే ప్రమాదం ఉందన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లల ప్రవర్తనపై దృష్టి పెట్టాలని, నిత్యం ఆన్‌లైన్‌లో వారు చేసే కార్యకలాపాలు గమనిస్తుండాలని చెప్పారు. బెట్టింగ్‌కు పాల్పడే వారి పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు ఉల్లి బహిరంగ వేలం

దేవరకద్ర: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం ఉల్లి బహిరంగ వేలం నిర్వహిస్తారు. నాలుగు రోజులుగా మార్కెట్ యార్డుకు వరుసగా సెలవులు రావడం వల్ల శనివారం నుంచి మంగళవారం వరకు లావాదేవీలు జరగలేదు. బుధవారం మార్కెట్‌లో లావాదేవీలు ప్రారంభం కానున్నాయి. ఉదయం 10 గంటల నుంచి ఉల్లి వేలం జరుగుతుంది. మధ్యాహ్నం ధాన్యం టెండర్లు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

నేడు ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమావేశం

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమావేశాన్ని బుధవారం స్థానిక పారిశ్రామికవాడలోని ఫోరం కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ ఫోరం అధ్యక్షుడు ఎ.రాజసింహుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న సమావేశానికి ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సంతోష్‌కుమార్, సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జగపతిరావు తదితరులు హాజరవుతారన్నారు.

ఎల్ఆర్ఎస్ రాయితీ గడువు పెంచాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌పై ప్రకటించిన 25 శాతం రాయితీని ఈ నెలాఖరు వరకు పొడిగించాలని సీనియర్ సిటిజన్స్ ఫోరం అధ్యక్షుడు జగపతిరావు, కార్యదర్శి నాగభూషణం విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ మహేశ్వర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ కారణాలతో వేలాది మంది దరఖాస్తులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. ఎంతోమంది దూర ప్రాంతాల్లో ఉండటం, మరికొందరు అందుబాటులో లేకపోవడంతోపాటు పండగలు, ఇతర సెలవు దినాలు రావడంతో పూర్తిస్థాయిలో ఫీజు చెల్లించలేకపోయారన్నారు. అంతేగాక వెంచర్లు చేస్తున్న బిల్డర్లు సంబంధిత గ్రామ పంచాయతీ, మున్సిపల్ కార్యాలయం, ముడా నుంచి ఎలాంటి అనుమతి తీసుకోకుండానే ప్లాట్లు చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి వెంచర్లలో పది శాతం ఖాళీ స్థలాన్ని వదిలిపెట్టి ప్లాట్లు చేయాల్సి ఉండగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పుడు వాటికి సంబంధించిన ఫీజును సైతం ప్లాట్ల యజమానులే భరించాలనడం సరికాదన్నారు. వెంచర్లు చేసిన వ్యాపారుల నుంచే ఆ రుసుం వసూలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఫోరం నాయకులు అనంతరెడ్డి, అహమ్మద్, రాజసింహుడు తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్ మహేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సీనియర్ సిటిజన్స్ ఫోరం నాయకులు

రేపు ఎంవీఎస్‌లో నేషనల్ సెమినార్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో గురువారం కామర్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 'ఆర్థిక అభివృద్ధి- సూక్ష్మ చిన్న, మధ్యతరహా పరిశ్రమల పాత్ర- అవకాశాలు- సవాళ్లు' అనే అంశంపై ఒకరోజు నేషనల్ సెమినార్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పద్మావతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా పాలమూరు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ శ్రీనివాస్, కళాశాల విద్యా జాయింట్ డైరెక్టర్ యాదగిరి, రాజేంద్రసింగ్, పీయూ కంట్రోలర్ రాజ్‌కుమార్, జిల్లా ఇండస్ట్రీస్ మేనేజర్ ప్రతాప్ హాజరవుతారన్నారు. సమావేశంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడంతోపాటు ఆయా అంశాలపై అవగాహన పెంచుకోవాలని ఆమె కోరారు.

సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం

- జిల్లాలో 92.29 శాతం దుకాణాలకు చేరిన బియ్యం

చౌకధర దుకాణాలు	రేషన్‌కార్డులు	యూనిట్లు	నెలవారి కోటా
506	2,66,759	8,16,588	4,318 మె.ట.



భూత్పూర్ మండలం తాటికొండలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన తెల్ల కార్డు లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీని మంగళవారం జిల్లావ్యాప్తంగా లాంఛనంగా ప్రారంభించారు. దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి పేదలకు సన్న బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టగా.. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి బుధవారం బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. జిల్లాలోని 506 చౌకధర దుకాణాల్లో తెల్ల రేషన్ కార్డుదారులకు ఒకరికి ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం పంపిణీ చేస్తున్నారు. రేషన్ పంపిణీ వ్యవస్థ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు దొడ్డు బియ్యం అందజేసిన ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి హామీ మేరకు సన్న బియ్యం పంపిణీ చేస్తుండటంతో పేదలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కేటాయింపుల్లో ఆలస్యం

ప్రతినెలా 20వ తేదీ వరకే చౌకధర దుకాణాలకు రేషన్ కేటాయింపులు పూర్తవుతాయి. ఆ తర్వాత ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి లారీల్లో బియ్యాన్ని చేరవేస్తారు. అయితే ఈ నెలలో సన్న బియ్యం పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో మార్చి 27న కేటాయింపుల ఉత్తర్వులు వెలువడ్డాయి. 28 నుంచి లారీల్లో సన్న బియ్యాన్ని రవాణా చేయడం ప్రారంభించారు. 30న ఉగాది, 31న రంజాన్ రావడంతో బియ్యం సరఫరా కాస్త ఆలస్యమైంది. జిల్లాలో ప్రస్తుతం 92.29 శాతం చౌకధర దుకాణాలకు సన్న బియ్యం చేరినట్లు అధికారులు పేర్కొంటున్నారు. గతంలో మాదిరిగా ఒక్కో యూనిట్‌కు ఆరు కిలోల సన్న బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.

మొదటి విడతలో

మొత్తం కోటా రానప్పటికీ మొదటి విడతలో ఒక్కో చౌకధర దుకాణానికి 50 క్వింటాళ్ల బియ్యం వచ్చాయి. వీటిని పంపిణీ చేసేలోగా రెండో విడతలో బియ్యం చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు వివరించారు. కోటా ప్రకారం ఒక్కో దుకాణానికి 100 క్వింటాళ్ల నుంచి 200 క్వింటాళ్ల వరకు రావాల్సి ఉంది. మొత్తం కోటా పంపిణీ ప్రతినెలా 15లోగా పూర్తి చేస్తారు. ఈ నెల కూడా గడువులోగా పూర్తి చేసే ఆలోచనలో అధికారులు ఉన్నారు.

ఎమ్మెల్యేల చేతులమీదుగా..



జిల్లావ్యాప్తంగా 506 చౌకధర దుకాణాలకు సన్న బియ్యం చేరుకుంది. దేవరకద్ర, జడ్చర్ల నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల చేతులమీదుగా బియ్యం పంపిణీకి లాంఛనంగా శ్రీకారం చుట్టాం. అయితే మొదటి విడతలో ఒక్కో దుకాణానికి 50 శాతం మేర బియ్యాన్ని సరఫరా చేయించాం. వీటిని లబ్ధిదారులకు పంపిణీ చేసేలోపు మిగతా బియ్యం చేరవేస్తాం. రేషన్ కార్డుదారులందరికీ ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేస్తాం.

– వెంకటేష్, జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి

సెలవు దినంగా ప్రకటించాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్‌సాగర్

స్టేషన్ మహబూబ్‌నగర్: మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి రోజును ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌సాగర్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తన జీవితాన్ని అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన పోరాటయోధుడు మహాత్మ జ్యోతిరావుపూలే అని గుర్తుచేశారు. అలాంటి మహానుభావుని జయంతి రోజును ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించి కార్యక్రమాలు నిర్వహించి అతని గొప్పతనాన్ని అందరికీ తెలియజేసే విధంగా ముందుకు వెళ్లాలని కోరారు. రిటైర్డ్ డీఈఓ విజయ్‌కుమార్ మాట్లాడుతూ జ్యోతిరావుపూలే తన అనుచరులతో కలిసి దిగువ కులాల ప్రజలకు సమాన హక్కులు కల్పించాలనే ఉద్దేశంతో సత్యశోధక్ అనే సంస్థను ఏర్పాటు చేసి అన్ని కులాలు, మతాలను భాగస్వామ్యం చేసి అణగారిన వర్గాల పక్షాన పోరాటం చేసిన మహాయోధుడు అన్నారు. సమావేశంలో ప్రముఖ కవి భీంపల్లి శ్రీకాంత్, రమేష్‌గౌడ్, సారంగి లక్ష్మీకాంత్, బుగ్గన్న, అశ్విని సత్యం, మహేష్‌గౌడ్, నరహరి పాల్గొన్నారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ ఇద్దరి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఇద్దరు మృతిచెందారు. ఎస్ఐ గోవర్ధన్ వివరాల మేరకు.. నాగర్‌కర్నూల్ మండలం గగ్గలపల్లికి చెందిన చిక్రొండ బాలమ్మ (60) చాలా రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుంది. ఈ క్రమంలో తీవ్ర మనస్థాపానికి గురైన ఆమె.. గతనెల 25న ఇంట్లో పురుగు మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి భర్త చంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

■ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరో మహిళ మృతిచెందింది. ఎస్ఐ వివరాల మేరకు.. నాగర్‌కర్నూల్ మండలం గగ్గలపల్లికి చెందిన పస్పరి మల్లమ్మ (45) కూతురికి వివాహం జరగడంతో కొన్ని రోజులుగా ఒంటరిగా జీవనం సాగిస్తుంది. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె మనస్థాపానికి గురై ఈ నెల 26న పురుగు మందు తాగింది. గమనించిన చుట్టుపక్కల వారు జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి కూతురు శివమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రేకులపల్లిలో మరో వ్యక్తి..

గద్వాల క్రైం: మండలంలోని రేకులపల్లికి చెందిన నారాయణ (35) చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ వివరాల మేరకు.. మృతుడు నారాయణ నాలుగు రోజుల క్రితం కృష్ణా నదిలో పట్టుకున్న చేపలను విక్రయించేందుకు బైక్‌పై గద్వాలకు వస్తుండగా.. మార్గమధ్యంలో ప్రమాదవశాత్తు అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో గొర్ల కాపరి మృతి

అచ్చంపేట రూరల్: విద్యుదాఘాతంతో గొర్ల కాపరి మృతిచెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఏఈ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం నల్లొండ జిల్లా చందంపేట మండలానికి చెందిన గొర్ల కాపరి చొక్లి వెంకటయ్య కొన్ని రోజుల నుంచి ఘణపూర్ గ్రామ శివారులో గొర్ల మంద ఉంచి మేపుతున్నాడు. గ్రామానికి చెందిన ఇస్లావత్ వెంకన్న పొలాన్ని కాపాడుకునేందుకు కంచెకు విద్యుత్ సరఫరా ఏర్పాటు చేసుకున్నాడు. ప్రమాదవశాత్తు గొర్ల కాపరి కంచెకు తగిలి విద్యుదాఘాతంతో మృతిచెందాడు. సిద్దాపూర్ ఎస్ఐ పవన్‌కుమార్‌ను వివరణ కోరగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆటో బోల్తా.. ఇద్దరికి గాయాలు



వెల్దండ: మండలంలోని కొట్రగేట్ వద్ద ఆటో బోల్తా పడి ఇద్దరికి గాయాలైన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బిజినేపల్లి మండలం మహదేవుపూర్ తండాకు చెందిన గోరమియ్య, ఇమాబీలు హైదరాబాదు నుంచి ఆటోలో స్వగ్రామానికి వెళ్తున్నారు. మార్గమధ్యలో కొట్రగేట్ వద్ద ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో గోరమియ్య, ఇమాబీలు గాయపడ్డారు. అదేసమయంలో వెల్దండ వైపు వెళ్తున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ గమనించి క్షతగాత్రులను పోలీస్‌వాహనంలో కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం గాయపడిన వారి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

కారు, బైక్ ఢీకొని..

ఎర్రవల్లి: జాతీయ రహదారిపై స్పోర్ట్స్ బైక్ కారును ఢీకొట్టిన ఘటనలో ఇరువురికి గాయాలైన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాలు.. కడప జిల్లాకు చెందిన కృష్ణారెడ్డి, కొండారెడ్డి స్పోర్ట్స్ బైక్‌పై హైదరాబాద్ వెళ్తున్న క్రమంలో జాతీయ రహదారిపై జింకలపల్లి స్టేజీ సమీపంలో ముందు వెళ్తున్న కారును ఢీకొట్టారు. ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు స్థానికులు పేర్కొన్నారు.

బైక్‌పై నుంచి పడి..

వనపర్తి రూరల్: కంభాళాపురం గ్రామ శివారులోని రైస్ మిల్లు వద్ద టీవీఎస్ బైక్ అదుపు తప్పడంతో ఇద్దరు కిందపడి గాయాలపాలయిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పీపనగండ్ల మండలంలోని గోవర్ధనగిరి గ్రామానికి చెందిన దుబ్బ చింతలయ్య, చిన్న చింతలయ్య బైక్‌పై శ్రీరంగాపురం నుంచి పెబ్బేరు వెళ్తున్నారు. ఈ క్రమంలో కంభాళాపురం గ్రామ శివారులోని రైసుమిల్లు వద్ద కుక్క అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. దుబ్బ చింతలయ్యకు తలకు తీవ్ర గాయాలు కావడంతో వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చిన్న చింతలయ్యకు స్వల్ప గాయాలు కావడంతో పెబ్బేరు ఆస్పత్రికి తీసుకెళ్లారు.

సమస్యలతో సతమతం!



షెడ్లు చాలక ఆరుబయట కుప్పలుగా పోసిన ధాన్యం

బాదేపల్లి మార్కెట్ యార్డులో చాలీచాలని షెడ్లు

- ఆరుబయటే ధాన్యం విక్రయాలు
- వర్షం వస్తే రైతుల తంటాలు
- మౌలిక సౌకర్యాలు లేక అవస్థలు



శిథిలావస్థకు చేరిన బాదేపల్లి మార్కెట్ కార్యాలయం

జడ్చర్ల: రాష్ట్రస్థాయిలో పేరుగాంచిన బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. యార్డులో కనీస మౌలిక సదుపాయాలు లేక రైతులు అవస్థలు పడుతున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల నుంచి రైతులు తమ పంట దిగుబడులను అమ్మేందుకు బాదేపల్లి మార్కెట్‌కు వస్తుంటారు. ఏడాది పొడవునా ఇక్కడ క్రయవిక్రయాలు కొనసాగుతుంటాయి. ప్రతి ఏడాది లక్ష్యానికి మించిన ఆదాయం లభిస్తోంది. ఈనామ్ మార్కెట్లుగా జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన వాటిలో బాదేపల్లి మార్కెట్ ఉందంటే అతిశయోక్తి కాదు. ఇంత ప్రాముఖ్యత కలిగిన యార్డులో సమస్యలు తాండవం చేస్తున్నాయి.

చాలీచాలని షెడ్లు..

మార్కెట్ యార్డులో చాలీచాలని షెడ్లు ఉండటంతో ఎక్కువగా ఆరుబయటే ధాన్యం క్రయవిక్రయాలు కొనసాగుతున్నాయి. అకాల వర్షాలు వచ్చినప్పుడు రైతుల ధాన్యం కొట్టుకుపోయి తీవ్రంగా నష్టపోతున్నారు. మార్కెట్ యార్డులో పూర్తిస్థాయిలో షెడ్లు నిర్మించాలన్న ప్రతిపాదనలు కొన్నేళ్లుగా ఆచరణకు నోచుకోవడం లేదు.

జాడలేని సీసీ కెమెరాలు..

మార్కెట్ యార్డులో ఎప్పుడేం జరుగుతుందో తెలుసుకోవడంతో పాటు చోరీలు తదితర మోసాలపై నిఘా పెట్టేందుకు ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు జాడ లేకుండా పోయాయి. దాదాపు దశాబ్దం క్రితం యార్డులో సీసీకెమెరాలను ఏర్పాటు చేశారు. తదుపరి అవి ఎక్కడికి పోయాయో ఇప్పటి వరకు తెలియదు. దీంతో వ్యవసాయ పంట ఉత్పత్తుల క్రయవిక్రయాల్లో పారదర్శకతను గమనించే పరిస్థితి లేకుండా పోయింది. యార్డుకు రోజు కొన్ని వేల బస్తాల ధాన్యాన్ని రైతులు తీసుకువస్తారు. దొంగలు ఇతర మోసగాళ్లు రైతులతో కలిసి కలివిడిగా తిరుగుతూ తమ పనులను తాము చేసుకుపోతుంటారు. అంతేగాక ధాన్యం బస్తాలను తూకం వేసి నిల్వ చేసే క్రమంలోనూ తారుమారు కావడం .. లేదా దొంగతనానికి గురికావడం, తదితర అక్రమాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఆయా వాటిని సీసీ కెమెరాల ద్వారా గుర్తించి, చక్కదిద్దే పరిస్థితి ఉంటుంది.

రైతులకు విశ్రాంతి కరువు..

ఆరుగాలం కష్టించి పండించిన పంట దిగుబడులను అమ్ముకోవడానికి మార్కెట్ యార్డుకు వచ్చే రైతులు కాస్త సేద తీరేందుకు గతంలో ఓ విశ్రాంతి భవనం ఉండేది. ఆ భవనం శిథిలావస్థకు చేరడంతో తొలగించారు. ఇప్పటి వరకు విశ్రాంతి భవనం నిర్మించక పోవడంతో రైతులు షెడ్లలోనే సేద తీరాల్సి వస్తుంది. అదే విధంగా సరైన మరుగుదొడ్లు అందుబాటులో లేక పోవడంతో బయటకు వెళ్లాల్సి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా మహిళా రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఇక భోజనం ధాన్యం కుప్పల వద్ద దుమ్మూ దూళి మధ్యే చేయాల్సి వస్తుంది. మార్కెట్ యార్డులో స్వచ్ఛమైన తాగునీటి వసతి కల్పించాలని రైతులు కోరుతున్నారు.

వసతులు లేవు..



మార్కెట్ యార్డులో రైతులకు కనీస వసతులు లేవు. స్వచ్ఛమైన తాగునీరు లేదు. కనీసం ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనం చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు ఎక్కడా లేవు. దుమ్ము దూళి మధ్యనే భోజనం చేసే పరిస్థితి ఉంది. తాగునీరు ,మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు కల్పించాలి. – చెన్నయ్య, రైతు, మరికల్, తిమ్మాజిపేట మండలం

మధ్యాహ్న భోజనం అమలుచేయాలి..



మార్కెట్ యార్డులో మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలుచేయాలి. రైతులకు అన్ని సౌకర్యాలతో కూడిన విశ్రాంతి భవనాలను నిర్మించాలి. అదే విధంగా ధాన్యం కుప్పలకు రక్షణగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి. – రాంచంద్రయ్య, రైతు, బోయిన్‌పల్లి, మిడ్జిల్ మండలం

సమస్యల పరిష్కారానికి చర్యలు..



బాదేపల్లి మార్కెట్ యార్డులో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. శిథిలావస్థకు చేరిన మార్కెట్ కార్యాలయ భవనం స్థానంలో కొత్త భవనాన్ని నిర్మించేందుకు కృషిచేస్తా. అదే విధంగా రైతులకు విశ్రాంతి భవనం తదితర మౌలిక సౌకర్యాలు కల్పిస్తాం. అదనంగా షెడ్లు నిర్మించేందుకు ఇప్పటికే ప్రతిపాదనలు పంపించాం. ఇక సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. – తంగెళ్ల జ్యోతి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్, బాదేపల్లి

పస్తులతో పడిగాపులు కాయాల్సిందే..

దేశానికి అన్నంపెట్టే అన్నదాతకు మార్కెట్ యార్డులో పస్తులతో పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి మార్కెట్‌లో పంట ఉత్పత్తులను విక్రయించడానికి వచ్చే రైతాంగానికి మధ్యాహ్న భోజనం అందించే పథకానికి శ్రీకారం చుట్టాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. సీజన్‌లో రోజు దాదాపు 200 మంది రైతులు వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం యార్డుకు వచ్చే రైతులు తమ ఇంటి నుంచి భోజనం తీసుకువచ్చి యార్డులో భుజిస్తున్నారు. మరికొందరు రైతులు హోటళ్లను ఆశ్రయిస్తున్నారు. నిరుపేద రైతులు హోటళ్లకు వెళ్లలేక కడుపు మాడ్చుకుంటున్నారు.

ఎల్ఆర్ఎస్ @ రూ.73.99 కోట్లు



- ఉమ్మడి జిల్లాకు సమకూరిన ఆదాయం
- అత్యధికంగా మహబూబ్‌నగర్ నుంచి రూ. 32.40 కోట్లు
- అత్యల్పంగా జోగుళాంబ గద్వాలలో రూ. 6.39 కోట్లు వసూలు
- గతనెల 31వ తేదీతో ఎల్ఆర్ఎస్ ఫీజు రాయితీకి ముగిసిన గడువు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఎల్ఆర్ఎస్‌తో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు రూ. 73.99కోట్ల ఆదాయం సమకూరింది. ఇందులో అత్యధికంగా మహబూబ్‌నగర్ జిల్లాలో రూ. 32.40 కోట్లు, అత్యల్పంగా జోగుళాంబ గద్వాలలో రూ.6.39 కోట్లు వసూలయ్యాయి. ఇక నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి 15.15 కోట్లు, వనపర్తి జిల్లా నుంచి రూ.10.85 కోట్లు, నారాయణపేట నుంచి రూ.9.20 కోట్లు వచ్చాయి. కాగా, ఎల్ఆర్ఎస్‌కు సంబంధించి 25 శాతం రాయితీతో పూర్తి ఫీజు చెల్లించేందుకు గత నెల 31వ తేదీతో గడువు ముగిసింది.

జిల్లాల వారీగా వివరాలిలా..

■ మహబూబ్‌నగర్ జిల్లాలో పాలమూరు మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు మూడు మున్సిపాలిటీలు, 422 గ్రామపంచాయతీలు ఉన్నాయి. 2020లో ఎల్ఆర్ఎస్‌కు 98,165 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో అర్హత కలిగిన 75,345 మందిని అధికారులు గుర్తించగా.. పూర్తిస్థాయిలో 15,098 మంది ఫీజు చెల్లించారు. ఇందులో ఇప్పటి వరకు 1,448 మందికి ప్రొసీడింగ్స్ అందాయి. అలాగే ఇటీవల మరో 1,032 మంది ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నా పరిష్కారానికి నోచుకోలేదు.

■ నాగర్‌కర్నూల్ జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలు, 461 గ్రామపంచాయతీలు ఉన్నాయి. 68,151 మంది తమ ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు దరఖాస్తు చేసుకోగా.. 57,022 మంది అర్హులుగా అధికారులు గుర్తించారు. వీరిలో 9,217 మంది ఫీజు చెల్లించగా.. ఇప్పటి వరకు 1,118 మందికి ప్రొసీడింగ్స్ అందాయి. ఇటీవల మరో 656 మంది ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకోగా.. పరిష్కారానికి నోచుకోలేదు.

■ వనపర్తి జిల్లాలో ఐదు మున్సిపాలిటీలు, 258 జీపీలు ఉండగా.. ఎల్ఆర్ఎస్ కోసం 69,740 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో అర్హత కలిగిన 63,546 మందిని అధికారులు గుర్తించగా.. పూర్తిస్థాయిలో 8,612 మంది ఫీజు చెల్లించారు. వీరిలో ఇప్పటి వరకు 1,843 మందికి ప్రొసీడింగ్స్ అందాయి. ఇటీవల మరో 751 మంది ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నారు.

■ నారాయణపేట జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలు, 280 జీపీలు ఉండగా.. 2020లో ఎల్ఆర్ఎస్ కోసం 34,799 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో అర్హత కలిగిన 23,571 మందిని అధికారులు గుర్తించగా.. 5,246 మంది ఫీజు చెల్లించారు. ఇప్పటి వరకు 491 మందికి ప్రొసీడింగ్స్ అందాయి. అదే విధంగా ఇటీవల మరో 310 మంది ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకోగా.. పరిష్కారానికి నోచుకోలేదు.

■ జోగుళాంబ గద్వాల జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలు, 255 జీపీలు ఉన్నాయి. 2020లో ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం 47,063 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 25,712 మందిని అర్హులుగా గుర్తించగా.. 4,636 మంది ఫీజు చెల్లించారు. వీరిలో 823 మందికి ప్రొసీడింగ్స్ అందాయి. ఇటీవల మరో 504 మంది ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నా పరిష్కారానికి నోచుకోలేదు.

అదుపు తప్పిన లారీ

ఇద్దరికి గాయాలు



ప్రమాదానికి గురైన లారీ

చారకొండ: వేగంగా వెళ్తున్న లారీ అదుపుతప్పి రోడ్డు పక్కకకు దూసుకెళ్లిన ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన చారకొండ మండలం జూపల్లి సమీపంలోని 167వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. కల్వకుర్తి నుంచి దేవరకొండ వైపు చక్కెర లోడ్‌తో వేగంగా వెళ్తున్న లారీ.. జూపల్లి సమీపంలో అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. గుంతల్లో సైతం లారీ వేగంగా వెళ్లడంతో ఇంజన్, బాడి క్యాబిన్ విడిపోయి పక్కనున్న పొలంలో కూప్పకూలింది. ప్రమాదంలో లారీ డ్రైవర్ లక్ష్మీనారాయణ, క్లీనర్ ఏడుకొండలుకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఏఎస్ఐ అంజయ్య తెలిపారు.

జములమ్మ ఆలయ ఉద్యోగి చేతివాటం?

- హుండీ లెక్కింపులో రూ.లక్ష అపహరణ
- గోప్యంగా ఉంచిన ఆలయ నిర్వాహకులు

గద్వాల క్రైం: నడిగడ్డ ప్రజల ఆరాధ్య దైవం జములమ్మ అమ్మవారి ఆలయ హుండీని గత నెల 28న లెక్కించారు. ఆలయంలో విధులు నిర్వర్తించే ఓ ఉద్యోగి గుట్టుగా రూ.లక్ష నగదును అపహరించి ఎవరికి అనుమానం రాకుండా అక్కడి నుంచి జారుకున్నారు. మరుసటి రోజు ఈ విషయాన్ని సిబ్బంది గోప్యంగా చర్చించుకుంటుండగా ఆ నోట ఈ నోట బయటకు రావడంతో ఆలయ కమిటీ దేవాదాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన అధికారులు రెండ్రోజుల పాటు విచారణ చేపట్టగా ఆ ఉద్యోగి నగదును అపహరించినట్లు నేరం అంగీకరించారు. తీసుకున్న నగదును మంగళవారం అధికారుల సమక్షంలోనే హుండీలో వేశారు. కానీ ఆ ఉద్యోగిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా చేసిన తప్పిదం బయటకు రాకుండా గోప్యంగా ఉంచడంపై భక్తులు, సిబ్బంది అధికారులపై పెదవి విరుస్తున్నారు. ఈ ఘటనపై ఆలయ ఈఓ పురేందర్‌కుమార్‌ను వివరణ కోరేందుకు యత్నించగా అందుబాటులోకి రాలేదు. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ శ్రీకాంత్ వివరించారు.

మహిళపై దాడి

శాంతినగర్: మహిళపై దాడి చేసిన ఘటనలో కేసు నమోదైన సంఘటన వడ్డేపల్లి మండల పరిధిలోని తిమ్మాజిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ నాగశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. తిమ్మాజిపల్లికి చెందిన కుర్వ రాముడు, భార్య మాధవి ఇంట్లో భోజనం చేస్తుండగా అదే గ్రామానికి చెందిన దాసరి గోపాల్ వాగ్వాదానికి దిగాడు. భర్తతో గొడవపడుతున్న గోపాల్‌ను నిలువరించేందుకు ప్రయత్నించిన మాధవిని గోపాల్ తోయడంతో గోడకు తగిలి రక్తగాయాలయ్యాయి. బాధితురాలి భర్త రాముడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని నాగర్‌కర్నూల్ రోడ్డులోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ మాధవరెడ్డి మంగళవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలల ప్రకారం పట్టణంలోని నాగర్‌కర్నూల్ రోడ్డులోని అఖిల్ ఇంట్లో పేకాట ఆడుతున్నట్లుగా అందిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించారు. పేకాట ఆడుతున్న అఖిల్, క్రాంతి, సత్యం యాదవ్, సంతు యాదవ్, వంశీకృష్ణ, బురాన్, ప్రశాంత్‌లను పట్టుకొని వారి వద్ద నుంచి రూ.66,700 నగదు, పేక ముక్కలను సీజ్ చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

‘ఎంఆర్ఐ’ ఏర్పాటు ఎప్పుడో?

- జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఉగాది నాటికి ఏర్పాటు చేస్తామన్న వైద్యారోగ్యశాఖ మంత్రి
- ఇప్పటి వరకు భవన పరిశీలనకు నోచుకోని వైనం



మహబూబ్‌నగర్ జిల్లా జనరల్ ఆస్పత్రిలో మరమ్మతుకు గురైన సీటీ స్కాన్ మిషన్

పాలమూరు: జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఉగాది నాటికి ఎంఆర్ఐ సేవలను అందుబాటులోకి తీసుకువస్తామని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఇచ్చిన మాట నెరవేరడం లేదు. మంత్రి ప్రకటించి దాదాపు మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఎంఆర్ఐ మిషన్ ఏర్పాటుపై ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. కనీసం భవన పరిశీలన కానీ, ఎక్కడ ఏర్పాటు చేయాలనే విషయంపై నిర్ణయం సైతం జరగలేదు. అసలు ఎంఆర్ఐ సేవలు ఎన్నాళ్లకు అందుబాటులోకి వస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఎంఆర్ఐ సేవలు అందుబాటులోకి వస్తే ఉమ్మడి జిల్లాలోని పేదలకు ఎంతో మేలు చేకూరుతుంది.

మరమ్మతుకు నోచుకోని సీటీ స్కాన్ మిషన్..

జనరల్ ఆస్పత్రిలో కొత్తగా ఏర్పాటుచేసే ఎంఆర్ఐ జాడ లేకపోయినా.. మరమ్మతుకు గురైన సీటీ స్కాన్ మిషన్ అయినా బాగు చేయించాలని రోగులు కోరుతున్నారు. సీటీ స్కాన్ మరమ్మతుకు దాదాపు రూ. 39లక్షల వరకు వెచ్చించాల్సి ఉండటంతో నిధులు లేక అలాగే వదిలేశారు. ఈ విషయంపై మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నత స్థాయి అధికారులకు విన్నవించినా బాగు చేయడానికి నిధులు కేటాయించడం లేదు. ప్రధానంగా రోడ్డు ప్రమాదంలో గాయపడి సీరియస్‌గా ఉన్న క్షతగాత్రులతో పాటు జబ్బు తీవ్రత తెలుసుకోవడానికి సీటీ స్కాన్ అవసరం పడుతుంది. అలాంటి సీటీ స్కాన్ మిషన్ కొన్ని రోజులుగా మరమ్మతుకు నోచుకోవడం లేదు. ఫలితంగా పేద రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. నిత్యం పదుల సంఖ్యలో సీటీ స్కాన్ కోసం ప్రైవేటు స్కానింగ్ సెంటర్లను ఆశ్రయించి రూ. 2వేల నుంచి రూ. 3వేల వరకు వెచ్చిస్తున్నారు. ఇక రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రికి వచ్చిన క్షతగాత్రులకు సీటీ స్కానింగ్ అవసరమైతే వైద్యులు బయటకు రెఫర్ చేస్తున్నారు దీంతో గాయాలతో బయటకు వెళ్లి స్కానింగ్ చేసుకొని రావడానికి నానా తంటాలు పడుతున్నారు. ఈ విషయంపై జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.సంపత్‌కుమార్‌ను వివరణ కోరగా.. ఆస్పత్రిలో ఎంఆర్ఐ మిషన్ తప్పనిసరిగా ఏర్పాటు అవుతుందన్నారు. అందుకు ఇంకా కాస్త సమయం పడుతుందని తెలిపారు. ఇక సీటీ స్కాన్ మరమ్మతు విషయాన్ని ఇటీవల అసెంబ్లీలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని.. ఆ వెంటనే ఆరోగ్యశాఖ మంత్రి పేషి నుంచి ఫోన్ రావడంతో సీటీ స్కాన్ మరమ్మతుకు అయ్యే ఖర్చు వివరాలను అందించినట్లు చెప్పారు. త్వరలో మరమ్మతు చేసే అవకాశం ఉందన్నారు.

నిర్విరామంగా ‘టీబీఎం’ భాగాల తొలగింపు



సొరంగం నుంచి బయటకు తెచ్చిన టీబీఎం విడి భాగాలు, స్టీల్

ఎస్ఎల్‌బీసీ సొరంగంలో సహాయక చర్యలు ముమ్మరం



సొరంగం వద్ద జేపీ కార్యాలయంలో సహాయక బృందాల ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి

అచ్చంపేట: శ్రీశైలం ఎడమగట్టు కాలువ(ఎస్ఎల్‌బీసీ) సొరంగం లోపల చిక్కుకున్న ఆరుగురు కార్మికుల ఆచూకీ కోసం సహాయక బృందాలు గాలింపు చర్యలు చేపడుతుండగా.. పనులకు అడ్డంకిగా మారిన టీబీఎం భాగాల తొలగింపు ప్రక్రియ మంగళవారం మరింత వేగవంతం చేశారు. 39 రోజులుగా సొరంగం లోపల మట్టి, బురద, శిథిలాలను తొలగించేందుకు బృందాలు శ్రమిస్తున్నాయి. డీ1 నుంచి డీ2 మధ్యలో ఇటాచీల సాయంతో తీసిన మట్టిని కన్వేయర్ బెల్టు ద్వారా బయటకు పంపడంతోపాటు, వెంటిలేషన్‌తో పాటు కన్వేయర్ బెల్టును వంద మీటర్ల ముందు వరకు పొడిగించారు. సహాయక చర్యల్లో ఆర్మీ, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, సింగరేణి, హైడ్రా, రైల్వే, జీఎస్ఐ, ఎన్‌జీఆర్ఐ, ర్యాట్ హోల్ మైనర్స్, ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్లు, కేరళ కాడవర్ డాగ్స్,రోబోటిక్ వంటి 12 రకాల బృందాలకు చెందిన 600 మంది సహాయక సిబ్బంది పాల్గొంటున్నారు. సొరంగం లోపల ఎస్కవేటర్ల సహాయంతో మట్టిని బయటికి పంపిస్తూ నీటి ఊటను 150 హెచ్‌పీ మోటార్ల సహాయంతో డీవాటరింగ్ చేస్తున్నారు.

ప్రత్యేకాధికారి సమీక్ష

టీబీఎం చివరి బాగాలను కత్తిరించి మట్టి తవ్వకాలు చేపట్టే ప్రయత్నాలను సహాయక సిబ్బంది ముమ్మరం చేశారని ప్రత్యేకాధికారి శివశంకర్ లోతేటి తెలిపారు. ఈమేరకు అదనపు కలెక్టర్ దేవసహాయం, ఆర్మీ అధికారులు వికాస్‌సింగ్, విజయ్‌కుమార్, ఎస్‌డీఆర్ఎఫ్ అధికారి గిరిధర్‌రెడ్డి, హైడ్రా అధికారి జయప్రకాష్, సింగరేణి మైన్స్ రెస్క్యూ అధికారి మాధవరావు, దక్షిణ మధ్య రైల్వే అధికారి నేటి చంద్రం, రవీంద్రనాథ్, కాడవర్స్ డాగ్స్ ప్రతినిధి ప్రభాత్, ర్యాట్ హోల్ మైనర్స్ ప్రతినిధి ఫిరోజ్, జేపీ కంపెనీ ప్రతినిధులతో సహాయక చర్యలపై సమీక్ష నిర్వహించారు. కన్వేయర్ బెల్టు పునరుద్ధరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. టీబీఎం బాగాలు, స్టీల్, ఇనుము వస్తువులతోపాటు ఊటనీటిని బయటకు పంపించే ప్రక్రియ నిర్విరామంగా కొనసాగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర సహాయక బృందాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని, వీరి సేవలు మరింత విస్తృతం చేస్తామని ప్రత్యేకాధికారి అన్నారు.

రాములోరి బ్రహ్మోత్సవాలకు సిద్ధం

- 3న తిరుమంజన సేవతో ప్రారంభం
- 6న సీతారాముల కల్యాణం
- 7న సామ్రాజ్య పట్టాభిషేకం



కోదండరామస్వామి ఆలయం



కల్యాణానికి ముస్తాబైన సీతారాములు

ఎర్రవల్లి: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని కోదండరామస్వామి ఆలయంలో శ్రీరామ నవమిని పురస్కరించుకొని ఈనెల 3న నుంచి 8వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ సురేందర్‌రాజు మంగళవారం తెలిపారు. ఆరు రోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవాల్లో భాగంగా 3న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, అంకురార్పణ, 4న ధ్వజారోహణం, లక్ష్మీహయగ్రీవ హోమం, 5న ధన్వంతరీ హోమం, సుదర్శన హోమం, 6న సీతారాముల కల్యాణోత్సవం, రథోత్సవం, 7న సామ్రాజ్య పట్టాభిషేకం, ఐశ్వర్యప్రాప్తి, మహాలక్ష్మీ హోమం, 8న చక్రస్నానం, మహా పూర్ణాహుతి, పుష్పయాగం, ధ్వజారోహణం వంటి కార్యక్రమాలతో ఉత్సవాలు ముగియనున్నట్లు తెలిపారు. కావునా భక్తులు అధిక సంఖ్యలో ఉత్సవాలకు హాజరై కనులారా తిలకించి స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని ఆయన కోరారు.